క్లుప్తంగా

మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యం



భూమి పూజ చేస్తున్న ఎంపీపీ లత

కార్వేటినగరం : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ లత తెలిపారు. ఆమె సోమవారం వెంకటాద్రిపురం బీసీ, ఎస్టీ కాలనీల్లో రూ.13 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ అన్ని గ్రామాల్లోనూ సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మండలంలో 95 శాతం సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేశామన్నారు. టీడీపీకి కంచుకోటగా ఉన్న ఈ గ్రామాలను ఆ పార్టీ నాయకులు పట్టించుకోలేదని ఆరోపించారు. కులం, మతం, రాజకీయాలను అతీతంగా పథకాలు అందిస్తున్నామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, ఎంపీటీసీ మురగయ్య, సర్పంచ్ చిన్న, ఉప సర్పంచ్ శేషాద్రి, జీజేలు రెడ్డి, రమేష్‌రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

కొండమల్లీశునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై వెలసిన జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం పాలాభిషేకం చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అదేవిధంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నేడు ప్రదోషకాల పూజలు

మండలంలోని డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలో ఉన్న అరుణగిరిపై కొలువైన జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం ప్రదోష కాల పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు రమేష్ తెలిపారు. నందీశ్వరునికి, శివునికి ఏకకాలంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేస్తామన్నారు.

చురుగ్గా కులగణన



బలిజకండ్రిగలో కుల గణన చేస్తున్న సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు

పాలసముద్రం : మండలంలోని తొమ్మిది గ్రామ సచివాలయాల పరిధిలో కులగణన చురుగ్గా సాగుతోంది. సోమవారం గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు క్రిష్ణజమ్మపురం గ్రామ సచివాలయ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. ఈ సర్వే 28వ తేదీ వరకు కొనసాగుతుందని ఎంపీడీవో రామనాథరెడ్డి తెలిపారు. వలస వెళ్లిన కుటుంబాలకు ఓటీపీ ద్వారా సర్వే పూర్తి చేయాలన్నారు.

తుది ఓటరు జాబితా



జాబితా విడుదల చేస్తున్న అధికారులు

శ్రీరంగరాజపురం : మండలంలో 29,240 మంది ఓటర్లు ఉన్నారని తహసీల్దారు బెన్నురాజ్ తెలిపారు. ఆయన సోమవారం ఓటరు జాబితాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 14,484 మంది పురుషులు, 14,755 మంది మహిళలు, ఒకరు ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. కొత్త జాబితాలో మార్పులు, చేర్పులకు ఆయా బీఎల్‌వోల వద్ద దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లోకనాథ పిళ్లై ఆర్ఐ ప్రభాకర్ పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులతో దాత చెంచురాజు

విజయపురం (నగరి) : మండలంలోని శ్రీహరిపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థి వరదరాజు చెంచురాజు సొంతి నిధులతో విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు రవి చేతుల మీదుగా సోమవారం విద్యార్థులకు విద్యా సామగ్రి అందించారు. ఉపాధ్యాయుడు వెంకమరాజు మాట్లాడుతూ దాత సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాల విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: అన్నదానం చేస్తున్న సర్పంచ్ భువనేశ్వరి



పాలసముద్రం: శ్రీరాముడు, ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



పెనుమూరు: సంకీర్తనలు ఆలపిస్తున్న భజన బృందం



అందరి బంధువయా.. అయోధ్య రామయ్యా!

- వాడవాడలా భజనలు, పూజలు
- శ్రీరామ చిత్రపటాలతో ర్యాలీలు
- మారుమోగిన జై శ్రీరామ్ నినాదం

నగరి : అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా వాడవాడలా ఆలయాల్లోను, ఇళ్లలోను పూజలు, భజనలు విశేషంగా నిర్వహించారు. అయోధ్యరాముడు అందరికీ బంధువయ్యాడు. సోమవారం ప్రాణ ప్రతిష్ఠ జరిగే సమయానికి మహిళలు ఇళ్లవద్ద దీపాలు పెట్టి పూజలు చేశారు. ఇంటి ముందు రామబాణాల ముగ్గులు వేసి రామునికి స్వాగతం పలికారు. రామాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. నగరి బ్రాహ్మణ సంఘం వారు కరియమాణిక్య స్వామి ఆలయం నుంచి శ్రీరాముని చిత్రపటంతో రామభజనలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఆద్యంతం కోలాటాలు, జైశ్రీరాం నినాదాల నడుమ ర్యాలీ కొనసాగింది.

ముడిపల్లిలో మంత్రి రోజా పూజలు

మండలంలోని ముడిపల్లిలో పురాతన కోదండ రామాలయంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా శ్రీరాముని విగ్రహప్రతిష్ఠ సందర్భంగా నిర్వహించిన పూజలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. రామ భజన, అర్చన కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ కోట్లాది భారతీయుల చిరకాల స్వప్నమైన బాలరాముని ప్రాణపతిష్ఠ నేడు నెరవేరడం శుభపరిణామమని చెప్పారు. అర్చకులు ఆలయ ప్రసాదాలను అందజేసి ఆమెను ఆశీర్వదించారు. ఆమె వెంట ఎంపీపీ భార్గవి, వైస్‌ఎంపీపీ కన్నియప్ప, మాజీ ఎంపీపీ జయచంద్రారెడ్డి, సర్పంచ్ ప్రకాష్, చంద్రారెడ్డి పాల్గొన్నారు.



నగరి: భజనలు చేస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న బ్రాహ్మణ సంఘు సభ్యులు

పుత్తూరు: అయోధ్యలో బాలరాముని ప్రతిష్ఠను పురస్కరించుకొని సోమవారం పుత్తూరు పట్టణం రామనామ స్మరణతో మార్మోగింది. ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. స్థానిక సంఘ్ పరివార్ సభ్యులు పట్టణ పురవీధుల్లో తోరణాలు కట్టి పండుగ శోభ కల్పించారు. అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. పండరీ భజనలు, హోమాలు, రామ కీర్తనలతో పండుగ వాతావరణం నెలకొంది. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతి ఇంటా బయట దీపాలు వెలిగించి రామ దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక కోదండ రామాలయంలో ఉదయం సీతా సమేత రామలక్ష్మణ హనుమంతు స్వాముల వారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం దీపోత్సవం తర్వాత స్వామి అమ్మవార్లను పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి కొలువుదీర్చారు. అనంతరం పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఇంటింటా స్వామి వారికి కర్పూర హారతులిచ్చారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

గ్రామాల్లో రామనామ స్మరణ

కార్వేటినగరం : అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం గ్రామాల్లో రామనామ సంకీర్తనలు మారుమోగాయి. వీధులను కాషాయ జెండాలతో అలంకరించారు. బొందు వీధిలో వెలసిన శ్రీసీతా కోదండరాముని ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్వామి, అమ్మవార్లను పట్టు వస్త్రాలు, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. అయోధ్య నుంచి అక్షింతలను పంపిణీ చేసి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. కార్వేటినగరం గాండ్లమిట్ట కూడలిలో యువత ఆధ్వర్యంలో అన్నప్రసాదాలు పంచిపెట్టారు.

వెయ్యి మందికి అన్నదానం

వెదురుకుప్పం: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం పాతగుంటలో శ్రీరామునికి పటాన్ని ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ భువనేశ్వరి ఆధ్వర్యంలో 1000 మందికి అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు బొజ్జారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

శ్రీరాముడికి, ఆంజనేయస్వామికి విశేష పూజలు

పాలసముద్రం : అయోధ్యలో సోమవారం శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని మండలంలోని క్రిష్ణజమ్మపురం ద్రౌపది అమ్మవారి ఆలయ సమీపంలోని శ్రీరాముడికి, ఆంజనేయుడికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అలాగే గణపతి హోమం, వాస్తు హోమం, నవగ్రహ హోమం చేపట్టారు. ఆంజనేయస్వామికి గుమ్మడికాయ, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్న అన్నదానం చేశారు.

కోదండరామాలయంలో ప్రత్యేక పూజలు

పెనుమూరు(కార్వేటినగరం) : పెనుమూరులో వెలసిన కోదండరామస్వామి ఆలయంలో సోమవారం అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయంలో పెద్ద ఎత్తున రాముల వారి సంకీర్తనలు ఆలపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు భజనలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానంచేశారు. గుత్తా వాసుదేవనాయుడు, కంచర్ల విశ్వ ప్రకాష్‌నాయుడు, సుబ్రమణ్యం, జయరామయ్య, వేణుగోపాలయాదవ్, గురుమూర్తినాయుడు, మోహన్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు.

భజన మందిరాల్లో ప్రత్యేక పూజలు

గంగాధర నెల్లూరు: అయోధ్య రామ మందిరంలో బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని రామభజన మందిరాలు రామ నామస్మరణతో హోరెత్తాయి. ముందుగా అన్ని భజన మందిరాలను విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. జీడీ నెల్లూరులోని దిగువూరులో రాముడి చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించి గరుడ వాహనంపై ఉరేగించారు. ఎగువూరులోని రామాలయంలో భజన బృందం ఆధ్వర్యంలో దాదాపు 350 మందికి గ్రామస్తులు అన్నదానం చేశారు. వేల్కూరులోని రామాలయాన్ని అలంకరించి భజనలు, ప్రత్యేక పూజలు చేశారు.











పుత్తూరు: అన్నదానం చేస్తున్న ఆలయ నిర్వాహకులు, ప్రత్యేక అలంకరణలో సీతా సమేత రామస్వాముల వారు, కార్వేటినగరం: ఊరేగుతున్న సీతా కోదండరామ స్వామి, నగరి: రావి ఆకులపై వెలిగించిన దీపాలు, జీడీ నెల్లూరు: ప్రత్యేక అలంకారంలో రాములవారు

వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



బి.బాబు



ఏ.రామ్మోహన్‌వర్మ

పుత్తూరు: ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి ఉండాలని స్థానిక పట్టణానికి చెందిన ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ కె.రవిరాజు అన్నారు. అసోసియేషన్ ఏర్పాటు చేసి 15 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. రవిరాజు మాట్లాడుతూ నూతన కార్యవర్గంలో అధ్యక్షుడి బి.బాబు, జనరల్ సెక్రటరీగా ఏ.రామ్మోహన్‌వర్మ, కోశాధికారిగా ఇ.లోకనాధనాయుడులతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు వివరించారు.

25న మెగా మెడికల్ క్యాంప్

సంస్థ ఏర్పాటు చేసి 15 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 25వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద మెగా మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరుపతికి చెందిన అస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి, వాసన్ ఐ కేర్, హియరింగు, డెంటల్‌కు సంబంధించి ఉచిత చికిత్సలు నిర్వహించి, మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనుమతులు లేకుండా పార్టీ జెండాలు పెట్టరాదు

నగరి : మున్సిపల్ అధికారుల అనుమతులు లేకుండా ఎక్కడంటే అక్కడ పార్టీ జెండాలు స్థాపించరాదని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇలాంటివి రాజకీయ గొడవలకు దారితీసేందుకు ఆస్కారం ఉందన్నారు. అనుమతులు లేకుండా ఎవరైనా ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కౌమారదశలో మార్పులపై అవగాహన అవసరం



విద్యార్థులకు స్పర్శపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మోహన్‌క్రిష్ణ

పాలసముద్రం : కౌమార దశలో బాల, బాలికల్లో కలిగే మార్పులపై అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. ఆయన సోమవారం ఆస్పత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్ర ,శనివారాల్లో బాలికలు, బాలురలో రక్తహీనత నివారణకు ఐరన్ పోలిక్ మాత్రలు మింగించాలన్నారు. శారీరక మార్పులతో వచ్చే సందేహాలను నివృత్తి చేసి తప్పులు చేయకుండా చూడాలని సూచించారు. అనంతరం పాలసముద్రం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులను స్పర్శలో తేడాలపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ మురళి, సుశీల, ఏఎన్ఎం గంగాగౌరి పాల్గొన్నారు.

నిరంతరంగా ఓటరు నమోదు

గంగాధర నెల్లూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల నిమిత్తం మండల పూర్తి స్థాయి ఓటరు జాబితాను సోమవారం ఎన్నికల ప్రత్యేకాధికారి భవాని విడుదల చేశారు. ఆమె తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఇప్పటి వరకు నమోదు చేసుకున్న ఓటర్ల సంఖ్య 53,875 అని, అందులో పురుషులు 26,870 మంది, స్త్రీలు 27,003 మంది, ఇతరులు ఏడుగురు ఉన్నారని తెలిపారు. ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ అని, నామినేషన్ చివరి రోజు వరకు కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. గతంలో కంటే దాదాపు ఈ సారి 11,045 మంది ఓటరుగా పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఐదుగురు



ఉత్తీర్ణులైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు

నగరి : మున్సిపల్ పరిధిలోని పుదుపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఐదుగురు నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్ 2023 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. వీరికి ప్రతి ఏడాది రూ.12 వేలు స్కాలర్ షిప్ వస్తుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు టీవీ రమేష్ తెలిపారు.

మామిడిలో యాంత్రీకరణపై అవగాహన



విద్యార్థుల చేసిన నమూనాలను పరిశీలిస్తున్న వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు

ఐరాల: మామిడి పంటలో యాంత్రీకరణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని 35 యర్లంపల్లె సచివాలయంలో తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ పథకంపై స్థానిక సర్పంచ్ మల్లీశ్వరి ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహాయ సంచాలకులు రమణ మాట్లాడుతూ మామిడి పంటకు మందుల పిచికారీ, కోత కోయడంలో యాంత్రీకరణ పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా విడుదలైన వరి, వేరుశనగ, చెరకు, రాగి మేలైన వంగడాల గురించి వివరించారు. చిరుధాన్యాలు, పప్పుధాన్యాల పొట్టు తీసే యంత్రాలు తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ మామిడిలో ప్రస్తుతం చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ప్రస్తుతం మామిడి తోటల్లో మొదటి పిచికారీ కోసం మోనోక్రోటోఫాస్-2 ఎంఎల్, బిప్రోఫైసిన్-1.5 ఎంఎల్, కార్బెండిజం- 1.5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని చెప్పారు. మామిడి రైతులు ప్రతి పిచికారీలోనూ వేప, కానుగ సంబంధిత నూనెలు కలుపుకొని వాడటం వల్ల ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. జిల్లా ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ రెడ్డి రాము మాట్లాడుతూ వివిధ పంటల్ల కలుపుకు వేసుకోవలసిన మందులు, ఎరువులు, జనవరి మాసంలో సాగు చేయాల్సిన పంటల గురించి రైతులకు వివరించారు. అనంతరం కళాశాల విద్యార్థులు వ్యవసాయ ప్రదర్శనలో భాగంగా సోలార్ ఇరిగేషన్, వర్మీకంపోస్ట్, పుట్టగొడుగుల పెంపకం, మల్చింగ్, సమగ్ర వ్యవసాయ పద్ధతుల నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త నాగమణి, ప్రిన్సిపల్ రెప్ర జెంటేటివ్ వెంకటరెడ్డి, వీఏఏ జ్యోత్స్న పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పిళ్లారిపట్టులో పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కెఎల్ఎన్ రెడ్డి

పుత్తూరు: పట్టణ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి పరిశీలించారు. ఒకటవ వార్డుకు చెందిన కట్టకింద రామకృష్ణాపురం, ఐదో వార్డు పిళ్లారిపట్టులో రూ.70 లక్షలతో జరుగుతున్న జీజీఎంఎఫ్ పనులను పరిశీలించారు. పనులను నాణ్యతతో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. పట్టణంలో రూ.1.10 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న ఎలక్ట్రికల్ శ్మశానవాటిక తుదిదశ పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ మంత్రి ఆర్కే రోజా ఆదేశాల మేరకు తిరుపతిలోని గోవిందధామం తరహాలో పుత్తూరులో దహన వాటికను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రహరీ గోడ, భవన నిర్మాణం పూర్తయిందని తెలిపారు. మిషనరీ, అస్తికలు భద్రపరిచేందుకు లాకర్ పనులు జరుగుతున్నాయని వివరించారు. గార్డెన్ (ఉద్యానవనం) పనులు సైతం ప్రారంభమయ్యాయని, త్వరలోనే అన్ని పనులు పూర్తి చేసి, విద్యుత్ శ్మశాన వాటికను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ హేమశేఖర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలే న్యాయ నిర్ణేతలు



మహిళలు (ఫైల్)



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

నగరి : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మహిళా ఓటర్లు కీలక పాత్ర పోషించనున్నారు. ఆర్డీవో సుజన సోమవారం విడుదల చేసిన తాజా ఓటర్ల జాబితా ఈ విషయం స్పష్టం చేస్తోంది. నియోజకవర్గంలో 2014 ఎన్నికల సమయంలో పురుషుల కంటే 287 ఓట్లు తక్కువగా ఉన్న మహిళలు 2019 ఎన్నికలు వచ్చేసరికి పురుషుల కంటే 2869 ఓట్లు ఎక్కువగా ఉన్నారు. ప్రస్తుతం విడుదల చేసిన ఓటర్ల జాబితాలో 5,277 మంది మహిళా ఓటర్లు పురుషుల కంటే అధికంగా ఉన్నారు. దీంతో ఎన్నికలను శాసించే దిశగా మహిళలే కీలకపాత్ర పోషించనున్నారు. 2019 ఎన్నికల్లో పురుషులు 91720, స్త్రీలు 94495, థర్డ్ జండర్ 12 అంటూ మొత్తం 1,86,227 మంది ఓటర్లు ఉండగా ప్రస్తుత ఎన్నికలకు పురుషులు 98,081, స్త్రీలు 1,03,358, థర్డ్ జండర్ 8 మంది అంటూ మొత్తం 2,01,447 మంది ఓటర్లు ఉన్నారు. గతంలో కంటే ఈ ఏడాది 15,220 మంది ఓటర్లు పెరిగారు. వీరిలో కొత్తగా ఈ ఏడాది ఓటు హక్కు పొందిన యువత 4756 మంది ఉన్నారు. 20 నుంచి 40 వయసులోపు ఉన్నవారు 92,598 మంది ఉన్నారు. 40 నుంచి 60 ఏళ్ల వయసులోపు ఉన్నవారు 75,021 మంది, 60 నుంచి 80 వయసులోపు ఉన్నవారు 27209, 80 నుంచి 100 ఏళ్ల వయసువారు 2131 మంది ఉండగా శతాధిక వృద్ధులు ఇద్దరు ఉన్నారు.

జాబితా సరిచూసుకోండి

పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితాను సరిచూసుకోవచ్చని ఆర్డీవో సుజన తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తుది ఓటర్ల జాబితా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచామన్నారు. అవసరమైన వారు పరిశీలించుకోవచ్చని చెప్పారు. ఎవరైనా నిజమైన అర్హత ఉండి ఓటు హక్కు కోల్పోయి ఉంటే ఎన్నికల్లో నిలబడే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే తేదీలోపు అన్ని ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వాటిని పరిశీలించి అదనపు జాబితాలో పేరు చేర్చనున్నట్లు వివరించారు.